అన్నానునేను. "చాల్లెద్దురూ" అని జడ వయ్యారంగా ఊపుకొంటూ ప్రక్కజూపులతో "పొద్దోయిందని" మాకాంతం పడక గదిలోకి దారితీసింది.

కలమింటి కోతి

పండగ వచ్చింది. పిల్లలు అప్పచ్చులు చేయమని మారాం చేశారు. కాంతం జిలేబి చేస్తానన్నది. తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి, అన్నారు. గారెలు చెయ్యమని నేనన్నా. పిల్లలకు తీపి యిష్టం, అవే చేస్తానని కాంతం అన్నది. కాసేపు తర్కించుకొన్నాము. చివరకు విసికిపోయి నేను ఊరుకోగానే విజయపతాకం ఎత్తింది కాంతం. జిలేబి చేయటానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. పోట్లాట ముదర కొట్టితే నాకే నష్టం, కాంతంమాట అట్లావుంచి. పిల్లలకోసం జిలేబి చేయకమానదు. తీరా నేను కోపం తెప్పించుకొని తినే సమయానికి తయారైతే నవ్వుబాట్లపని. అందుకని 'సరే ఏదో చెయ్యి. ఇంతకూ పిల్లలు తినకపోతే మనం చేసుకొని ఏమి ప్రయోజనం' అని నేను తగ్గాను.

ఇంతలో పెద్దపిల్ల వచ్చి 'అప్పచ్చులు చేశావుటే అమ్మా' అన్నది. చిన్నది గిన్నెచూచి ఏడుపు మొఖం వేసింది. పెద్ద పిల్లవాడు కర్రతీసికొని కొడతానంటున్నాడు. తరువాత పుట్టిన వాడు నాప్రక్కన కూర్చుని సంతోషంతో చప్పట్లు కొడుతున్నాడు. 'పిల్లలను కాస్త ఆడించండి, నేను ఇవి చేస్తాను' అన్నది.

కాంతం. 'అప్పచ్చు లేవే యింకా చేయలేదేం' అని అబ్బాయి చిన్నబెత్తం పుచ్చుకొని తల్లిదగ్గరకు పోయినాడు.

కాంతం — ఒరే, దానితో కొట్టావా కోతికి అప్పగిస్తా.

అబ్బాయి — ఏవీ, కోతులు?

కాంతం — ఉన్నవిలే.

నేను — ఒక కోతేగదే మనయింట్లో ఉంట్టా.

కాంతం — ఒక కోతేం చాలా ఉన్నవి.

నేను — కోతి అంటే జ్ఞాపకంవచ్చింది. ఒక కథ చెప్పేదీ?

కాంతం — చెప్పండి పోనీ.

పెద్దపిల్ల — చెప్పునాన్న – సుసీ, రావేవ్, నాన్న కథ చెపుతున్నాడు.

అబ్బాయి — కతా, నాన్న — చెప్పు.

నేను — చెపుతా, నీవుకూడా వినవే.

కాంతం — వింటున్నా చెప్పండి.

నేను — పూర్వం ఒకాయన —

కాంతం — చాలులెండి — ఉరుకోండి.

నేను — కథ వినరాదూ.

కాంతం — మీరుచెప్పే కథ నాకు తెలుసు.

నేను — వినరాదు తెలిస్తేమటుకు?

పెద్దది — చెప్పునాన్నా.

నేను — అమ్మ వద్దంటుంటే!

పెద్దది — అమ్మా చెప్పనియ్యవే.

కాంతం — వొద్దమ్మ అది బాగుండదు.

పెద్దది — ఆఁ బాగుంటుందే.

కాంతం — బాగుండదమ్మా.

పెద్దది — కాదే బాగుంటుంది. నాన్న చెప్పే కథలు అంచక్కా ఉంటాయే.

కాంతం — మీరు ఆకథ చెపితే నేనిక్కడ ఉండను.

నేను — ఉండకేమి చేస్తావులే.

పెద్దది — పోనీనాన్న! నేనుంటా చెప్పునాన్న.

నేను — వినమ్మా— ఆయన ఒకరోజున బజారునకు పోతుంటే...:.........

కాంతం — ఉండండి నేచెప్తా. ఒక చక్కని స్త్రీ కనుపించిందట.

నేను — కాదు. కాదు.

కాంతం — మీరుండండి. నేను చెబుతాను అడ్డంరాకండి. ఆమె చక్కదనాన్ని చూచి ఆయన మూర్ఛపోయినాడట. మొగాన నీళ్ళుచల్లితే లేచాడట.

నేను — అబ్బే, అది కానేకాదు.

పెద్దది — చెప్పు నాన్న.

నేను — ఒక కోతి కనిపించింది.

అబ్బాయి — కోతా, నాన్న, కోతిని నేజూచా.

నేను — ఎక్కడ జూశావురా?

అబ్బాయి — మనయింటికి వచ్చింది నాన్నా.

నేను — అవునురా, నాయనా. మన యింటికొచ్చి 8 ఏండ్లు అయింది.

అబ్బాయి — ఏమే, అమ్మా.

కాంతం — ఛా ఉరుకో, వెధవ. ఆడుకో పో.

అబ్బాయి — ఏమో నాన్నా, ఎన్ని ఏండ్లు అయిందో నాకు తెలియదు. కోతినిచూశా నాన్న, అంచక్కగ ఉంది.

నేను — చక్కగ ఉందిరా?

అబ్బాయి — ఏమే అమ్మా? అంచక్క ఉండదే?

కాంతం — నన్నడుగుతావేంరా! పో వెధవ, పోతావా పోవా?

అబ్బాయి — చూడు నాన్న, అంచక్కఉండదు నాన్న?

నేను — ఉంటుందిరా, నాన్న, నాకళ్ళకు అంచక్కా ఉంటుంది.

పెద్దది — కథ చెప్పు నాన్న, ఆ కోతి కనిపిస్తే...

నేను — ఆకోతిని చూచి ఆయన హడలిపోయి నిలుచున్న పాటున నిలువునా కొయ్యబారిపోయినాడు.

పెద్దది — కొయ్యబారితే ఏమైంది నాన్న?

నేను — కాసేపు అల్లాగే నిలువబడి మొగాన చేతులు పెట్టుకొని......

కాంతం — చాల్లే ఊరుకోండి, ఎవరైనా నవ్విపోతారు, నాకు తెలుసులెండి. ఈ కథ ఆపండి.

నేను — తెలిస్తే వినరాదు, అమ్మాయి విన్నట్లే,

కాంతం — సరే, వెక్కిరించటానికి తయారవుతారు తమరేం మహా అందగాళ్ళయినట్టు.

పెద్దది — చెప్పు, నాన్నా, కథ; ఊరుకోవే అమ్మ.

అబ్బాయి — కోతిమొగాన చేతులుపెట్టి ఏంజేశాడు నాన్న

కాంతం — బుగ్గగిల్లి ముద్దెట్టుకొన్నాడు.

అబ్బాయి — ఛీ, ఎక్కడైనా కోతిని ముద్దెట్టుకొంటారా?

నేను — వాడికున్న జ్ఞానం నీకు లేకపోయె.

కాంతం — జ్ఞానం ఎవరికిలేదో కొంచెం ఆలోచించండి.

పెద్దది — ఏమిటె గోల నాన్న? ఎప్పుడు పోట్లాటేనా? కథ చెప్పు నాన్నా, కోతి ఏంచేసింది నాన్నా?

నేను — కోతి మొగాన చేతులు పెట్టలేదు, తన మొగానే చేతులు పెట్టుకొని......

అబ్బాయి — కోతి మొగాన చేతులుపెడితేనేం నాన్న?

నేను — కరుస్తుందిరా!

అమ్మాయి — నీవు నవ్వబోకేఅమ్మ. ఎందుకు అట్లానవ్వుతావు? చెప్పునాన్న.

నేను — అందుకని తన మొగాన చేతులు పెట్టుకొని భోరున ఏడ్చాడు.

కాంతం — భావకవి ఏమోసుమండి ఆయన.

నేను — నీకుకూడ అంటింది — ఈవిద్య, ఎక్కిరించటం.

కాంతం — ఎవరండీ ఆయన——

భోరు భోరున ఏడుస్తాను,
ఎన్నెవ్వరూ ఆదరించవద్దు,
ఏడ్చేడ్చి ఎక్కెక్కి ఏడుస్తాను,
చిట్టచివరకు నట్టేట్లో దూకుతాను.

అని వ్రాస్తాడు.

నేను — ఏం కాంతం — నీవు పద్యాలు వ్రాస్తున్నావే మహా తెలిసినదానిలాగే. అది నువ్వు ఏడ్చేలాగ అర్థంచేసుకోరాదు. కవులు అట్లా ఏడుస్తారు.

కాంతం — అందరూనా అండి.

నేను — కొంతమంది.

కాంతం — మీరుకూడ, కవులు కామూలే?

పెద్దది — అమ్మా ఏమిటే ఆఒవ్వు. కథ చెప్పునాన్న.

నేను — ఎంతవరకుచెప్పాను - ఆఁ- ఏడ్చాడు.

కాంతం — ఛీఛీ, అంతా ఉండగానే.

నేను — ఏమిటి అట్లా అంటావు.

కాంతం — మీకథవిషయం కాదు. కుక్కవస్తున్నది.

నేను — ఏడ్చేటప్పటికి వాళ్ళువీళ్లు చేరారు.

పెద్దది — చేరి ఏంజేశారు?

కాంతం — ఆయనను బజారులో గోల చెయ్యవద్దని నెట్టారు. నామాట వినవుటే అమ్మాయి.

పెద్దది — పో, నాన్నను జెప్పనీ, నాన్న కథ చక్కగా చెపుతాడు. చెప్పునాన్న.

కాంతం — నామాట వినవే; తల్లి దైవముగదఒే!

పెద్దది — అవునులే.

నేను — నీవు దైవమువా?

కాంతం — అవును.

నేను — సుసీ, నేస్చెకో అమ్మా.

సుసీ — ఏమిటి నాన్నా.

నేను — తండ్రి దేవుడు.

సుసీ — తండి దేవులు.

నేను — తల్లిదైవము.

సుసీ — తల్లి దయ్యము.

కాంతం — అట్లా గాదమ్మా, తండ్రి దైవము.

సుసీ — తండి దయ్యము.

పెద్దది — ఏమిటి నాన్న, నవ్వుతావు - కథ చెప్పునాన్న.

నేను — వాళ్లు పిల్లు వచ్చి ఎందుకు ఏడుస్తున్నావు అన్నారు.

కాంతం — నాకర్మం అనలేకపోయినాడూ?

నేను — చెబుతున్నానుగా - ఇవ్వాళ నాభార్యా నేనూ పోట్లాడుకొన్నాము. అన్నాడు.

అబ్బాయి — అమ్మా, నీవూ పోట్లాడు కొంటావూ అత్తాగా ?

పెద్దది — ఆ, పోట్లాడుకొంటే ఏడవటంఎందుకు నాన్నా ?

నేను — ఆమెకు బాగా కోపం వచ్చి...

సుసీ — పోత్తాత ఎందుకో నాన్న;

నేను — ఆయన పండుగకు గారెలు చెయ్యమంటే ఆవిడ జిలేబి చేస్తానని పోట్లాడిందేమో?

కాంతం — కిన్నెరసాని గోదావరి కలసినయ్యే!

నేను — మరి కలుపుతున్నా - ఆవిడకు కోపం వచ్చి ఏదో తీసికొని వెంటబడ్డదట.

పెద్దది — ఏం తీసికొన్నదనాన్న?

నేను — తోటకూరకాడ ఏమో!

కాంతం — ఆగండి ఆగండి. ఆడదానికి ఆయుధాలు లేవా! వెంటబడటం దాకా వస్తే తోటకూర కాడ ఏమి లాభము. - శివుడికి త్రిశూలంలాగ - విష్ణుమూర్తికి చక్రం లాగ - అర్జునుడికి గాండీవంలాగ ఆడదానికీ ఉంది ఆయుధం.

నేను — నన్ను చెప్పనీ. తోటకూర కాడ తీసికొని వెంట బడ్డది.

పెద్దది — కాదు నాన్న.

నేను — ఊరుకో అమ్మాయి, చెప్పేది విను. నీవు ఆట్టే నవ్వక, కాంతం.

పెద్దది — వెంట బడితే?

నేను — ఆయన పారిపోయి బ్రతుకు జీవుడా అని బయట పడ్డాడట.

అబ్బాయి — పెళ్ళాం కొట్టింది నాన్న?

నేను — కొట్టబోతే పారిపోయినాడు.

పెద్దది — అమ్మ కొట్టొస్తే నేను పారిపోతానే అట్లాగా?

సుసీ — అమ్మ నీకు పెండ్లామేనా నాన్నా?

నేను — పెండ్లామే.

సుసీ — నిన్ను కొడుతుందా నాన్న, అమ్మ!

కాంతం — ఛీ ఊరుకో - ఏమిటండి పిల్లలకు మంచిబుద్ధులే చెపుతున్నారు.

నేను — కొట్టదే, ఎప్పుడైనా కరుస్తుందే.

పెద్దది — చెప్పునాన్న కథా.

నేను — తప్పించుకొచ్చి తిరుగుతుంటే కోతి కనపడే టప్పటికి పెండ్లాము జ్ఞాపకం వచ్చి, అదంతా జ్ఞాపకానికివచ్చి, భయపడి, ఏడ్చాడట.

అమ్మాయి — కథ బాగుందే అమ్మ!

కాంతం — కథా బాగుంది. మీనాన్నగారూ బాగున్నారు. సరేగాని కథ విన్నారు. అందరు చెవులు గిల్లుకోండి.

అమ్మాయి — గిల్లుకోడ మెందుకే అమ్మా? మేము గిల్లుకోము.

కాంతం వెళ్ళి పిల్లలందరి చెవులు కొంచెం కొంచెం గిల్లి వచ్చింది.

సుసీ — నాన్న చెవులుకూడా గిల్లవే అమ్మా!

నేను — నాచెవులు గిల్లక్కరలేదురా అమ్మనాన్నా! కళ్లు తెరిచినా మూసుకున్నా నాకు కోతి కనబడుతూనే వుంటుందిరా?

కాంతం – ఇదిగో అప్పచ్చి.

పిల్లలంతా గల్లంతుగా ఒక్కసారి లేచారు నాకు కావాలె, నాకుకావాలె అని ముందు చంటివాడు లేసుకొన్నాడు. రెండోది పెద్దబ్బాయిది. మూడోది సుసీల. నాలుగోది పెద్ద దానికి. అయిదోది నాకొచ్చింది. ఆరోది మాఅపెత తిన్నది.

నా మ క ర ణం

పసిపిల్లను పక్కలో పడుకోబెట్టుకొని పురిటి గదిలో నులక మంచంలో పడుకొంది కాంతం. పండబారిన తమలపాకుల లాంటి చెక్కిళ్ళపై లేత గులాబి రేకుల పసిచేతులు నిమురు కుంటుంటే కెంపుపూలతో కాంతం తన మాతృత్వాన్ని పూజించు కుంటూన్నట్టున్నది.

పురిటిగదిప్రక్కన నేను మంచంపైన పడుకొన్నాను. కొంత దూరాన మాబావమరిది పడుకొని ఏదో చదువుకొంటు న్నాడు. కాంతం విప్పారిన నేత్రాంచలములనంటి కనీనికల దాకా ప్రవహించే తన చూపును సవరించుకొంటూ "మరి–పేరేమిపెడదాము." అన్నది.

"ఏమండోయి మిమ్మలినే."

"ఏమిటి?"

"ఈచిట్టితల్లికి పేరేం పెడదాము?"

" ఏదో ఒకటి పెడదాంలెద్దూ"

"అదిగాదండీ, రేపేగదా బారసాల. అప్పటికప్పటికి